బీసీ గురుకులాల ఆర్‌సీవో బదిలీ

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : బీసీ గురుకులాల ఉమ్మడి మెదక్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్(ఆర్‌సీవో)గా విధులు నిర్వహిస్తున్న ఎం.గౌతంకుమార్‌రెడ్డి బదిలీ అయ్యారు. హైదరాబాద్ జిల్లాకు ఇన్‌చార్జి ఆర్‌సీవోగా బదిలీ చేస్తూ బీసీ గురుకులాల సెక్రటరీ సైదులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న జె.రాజేశంను ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ గురుకులాల ఇన్‌చార్జి ఆర్‌సీవోగా నియమించారు.



మంచు కాదిది.. కంపు

జిల్లెల వాగులో పారిశ్రామిక వ్యర్థాలు

జిన్నారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లెల వాగులో పరిశ్రమల రసాయన వ్యర్థాలు యథేచ్ఛగా ప్రవహిస్తున్నాయి. గడ్డపోతారం, కాజీపల్లి పారిశ్రామిక వాడ నుంచి గురువారం భారీగా రసాయన వ్యర్థాలు జిల్లెల వాగులోకి వదలడంతో కాజీపల్లి ప్రధాన రహదారి బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహానికి నురగ మంచు కొండను తలపించింది. రహదారిపై ప్రయాణించే వారు ఘాటు వాసనతో ముక్కుమూసుకున్నారు. పరిశ్రమల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంగారెడ్డి నియోజకవర్గంలో 18 వేల సంతకాల సేకరణ

రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే పిలుపుమేరకు ఓట్ చోరీకి వ్యతిరేకంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు..

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంతకాల సేకరణకు అపూర్వ స్పందన

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓట్ చోరీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా దేశవ్యాప్తంగా ఏఐసీసీ చేపట్టిన ఓట్ చోరీ సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో భాగంగా సంగారెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభించింది. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల పరిధిలో 89 గ్రామ పంచాయతీలు, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీల పరిధిలోని 64 వార్డుల్లో 18వేల మంది క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు. దీనిపై జగ్గారెడ్డి నేతృత్వంలో సంగారెడ్డిలో ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చేర్యాల ఆంజనేయులు, సంగారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుగౌడ్, సదాశివపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు



గాంధీభవన్‌కు పంపనున్న సంతకాల పత్రాలతో జగ్గారెడ్డి తదితరులు

జార్జ్, సంగారెడ్డి మండల అధ్యక్షుడు బుచ్చిరాములు, కొండాపూర్ మండల అధ్యక్షుడు, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సదాశివపేట మండల అధ్యక్షుడు సిద్దన్న, సదాశివపేట పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్లు రామచందర్ నాయక్, కుమార్, నాయకులు కూన సంతోష్, కిరణ్, నర్సింహారెడ్డి, ఆశిరెడ్డి, గుండు రవి, శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు సంగారెడ్డి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 89 గ్రామాలు, సదాశివపేట, సంగారెడ్డి మున్సిపాలిటీల్లోని 64వార్డుల్లో ఓట్ చోరీ సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించామని తెలిపారు. దొంగ ఓట్లను తయారుచేసి వాటి ద్వారా బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తోందని విమర్శించారు. ఒక రాష్ట్రంలో ఉన్న ఓట్లను మరో రాష్ట్రంలోకి.. ఒక జిల్లాలో ఉన్న ఓట్లు మరో జిల్లా లోకి మారుస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. బీజేపీ దొంగ ఓట్ల ప్రక్రియను రాహుల్ గాంధీ సాక్ష్యాధారాలతో నిరూపించినా ఎన్నికల కమిషన్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీజేపీతో లోపాయకారి ఒప్పందంలో భాగంగానే ఓట్ చోరీ జరుగుతోందన్నారు. ఇదే విషయంపై రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో ఎన్నోసార్లు ప్రస్తావించారన్నారు. సంతకాలు సేకరించిన పత్రాలను గాంధీభవన్‌లో అందజేస్తామన్నారు.

తాటిపల్లి వైన్స్‌కు

30 దరఖాస్తులు

మునిపలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని తాటిపల్లి వైన్‌షాప్‌కు 30 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 101 దుకాణాలుండగా తాటిపల్లి మినహా మిగిలిన దుకాణాలను ఈ నెల 27న లక్కీడ్రా ద్వారా కేటాయించిన విషయం తెలిసిందే. మునిపల్లి మండలం తాటిపల్లిలోని షాపు నంబర్ 24కు నిర్దేశించిన 20 దరఖాస్తుల కంటే తక్కువ రావడంతో మళ్లీ దరఖాస్తులను ఆహ్వానించారు. ఈ నెల 28వ తేదీ నుంచి వచ్చే నవంబరు1 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. గతంలో 19 దరఖఖాస్తులు రాగా.. 29న ఒకటి, గురువారం పది దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకునేందుకు మరో రెండు రోజులు గడువు ఉండడంతో దరఖాస్తులు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ వైన్స్‌కు సంబంధించి నవంబర్ 3న లాటరీ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ఇంద్రేశంలో పూర్తయిన

వార్డుల విభజన

ఓటర్లు 12,979, వార్డులు 18

పటాన్‌చెరు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పడిన ఇంద్రేశం పురపాలక సంఘంలో వార్డుల విభజన ప్రక్రియ ముగిసింది. ఈ నివేదికను కలెక్టర్ ప్రావీణ్యకు అధికారులు అందజేశారు. ఆరు గ్రామాల్లో 12,979 మంది ఓటర్లతో 18 వార్డులను ఏర్పాటు చేశారు. చిన్నకంజర్ల 2, పెద్దకంజర్ల 2, బచ్చుగూడ 1, రామేశ్వరంబండ 4, ఇంద్రేశం 7, ఐనోలు 1, ఐనోలులో కొంత, పెద్దకంజర్లలో కొంత భాగాన్ని కలిపి మరో వార్డుగా రూపొందించారు. ఒక్కో వార్డుకు 700 ఓటర్లు (10 శాతం ఎక్కువ లేదా తక్కువ) ఉండేట్లు విభజన ప్రక్రియ పూర్తి చేశామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

వందేళ్ల రైల్వేస్టేషన్‌లో **సమస్యల హాల్ట్** 7



మెదక్‌లో ఏర్పాటు చేసిన మున్సిపల్ వెంచర్ (ఫైల్)

సర్కారీ లే అవుట్!

- మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 25 ఎకరాలు సేకరణ
- వెంచర్ చేసేందుకు టెండర్లు
- 302 ప్లాట్లకు 'టౌన్' ప్లానింగ్
- రూ.2.30 కోట్లతో అభివృద్ధి
- రెండేళ్లుగా నిలిచిన పనులు
- వెంచర్ ఏర్పాటుపై అనిశ్చితి
- ఆందోళనలో భూములిచ్చిన రైతులు

మెదక్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణ విస్తరణ కోసం గత ప్రభుత్వం మున్సిపాలిటీ పరిధిలో ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. నాటి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు అప్పటి కలెక్టర్ రాజర్షిషా పట్టణ శివార్లలోని పిల్లి కోటాల్-రాజ్‌పల్లి శివార్లలో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూమిని సేకరించి వెంచర్‌ను నిర్మించాలని సంకల్పించారు. ఇందుకోసం సుమారు 12 మంది రైతుల నుంచి 25 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో 302 ప్లాట్లు చేసి మార్కెట్ రేట్‌కు విక్రయించాలని నిర్ణయించారు. నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్న మెదక్ మున్సిపాలిటీకి ఆదాయ వనరుగా మారుతుందని భావించారు. గత ఎన్నికలకు ముందు ఆదరాబాదరాగా అధికారులు టెండర్లు పిలిచారు. రూ.6 కోట్ల అంచనాతో పని దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు ల్యాండ్‌పూలింగ్ పనులు అప్పగించారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వ మారడం, అధికారుల నిర్లక్ష్యంతో ప్రాజెక్ట్ పనులు నిలిచిపోయాయి.



లేఅవుట్ మ్యాప్

భూములు ఇచ్చిన రైతులు ప్లాట్ల కోసం.. వెంచర్ పనులు చేసిన కాంట్రాక్టర్ బిల్లుల కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నారు. పట్టణంలోనే ఎప్పుడూలేని బృహత్తర ప్రాజక్టు అంటూ శంకుస్థాపన చేసిన వెంచర్ కేవలం ఫొటోలకే పరిమితమైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రాజెక్ట్ పూర్తయితే మున్సిపాలిటీకి రూ.70 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వెంచర్ పూర్తయితే పట్టణ రూపురేఖలే మారిపోతాయని అంటున్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

వెంచర్ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ లైనింగ్ తదితర పనుల కోసం రూ.2.30 కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు. కానీ, ఇప్పటివరకు కేవలం రూ.10 లక్షల బిల్లులు మాత్రమే వచ్చాయని ఆవేదన వ్యక్తంచేశారు. పనులు పూర్తిచేసినా బిల్లులు చెల్లించడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ల్యాండ్‌పూలింగ్ కింద భూములు ఇచ్చిన రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుత కలెక్టర్ చొరవచూపి ల్యాండ్‌పూలింగ్ ప్రాజెక్ట్ పనులు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎకరాకు 600 గజాల ప్లాటు

ల్యాండ్ పూలింగ్ ప్రాజెక్ట్ కోసం భూమిలిచ్చిన రైతులకు ఎకరాకు 600 గజాల ప్లాటు ఇస్తామని అప్పట్లో కలెక్టర్, మున్సిపల్ అధికారులు మిగతా 8వ పేజీలో

అకాల వర్షం.. అపార నష్టం..

మొలకెత్తిన ధాన్యం

ప్రభుత్వం ఆదుకోవాలంటూ రైతులు వేడుకోలు



పెద్దచింతకుంటలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

నర్సాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురిసిన అకాల వర్షంతో చేతికొచ్చిన వరి ధాన్యం తీవ్రంగా నష్టం వాటిల్లడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నర్సాపూర్ మండలంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా ఇంకా కొనుగోలు ప్రారంభం కాలేదు. రైతులు వడ్లను కేంద్రాల వద్దకు తీసుకువచ్చి నిరీక్షిస్తున్నారు. అకాల వర్షానికి పెద్దచింతకుంట, చిన్నచింతకుంట, తుజాల్‌పూర్, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిసి మొలకలు వస్తున్నది. పెద్దచింతకుంటలో మొలకలు వచ్చిన ధాన్యాన్ని గురువారం రైతు రక్షణ సమితి ప్రతినిధులు యాదాగౌడ్, చంద్రశేఖర్ తదితరులు పరిశీలించారు. న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

● మనోహరాబాద్: మండలంలోని పలు గ్రామాల్లో మొంథా తూఫాన్ కారణంగా వరి కేలకొరిగింది. తుపాకులపల్లికి చెందిన రైతు బోల్లబోయిన నరేందర్ రెండెకాల్లో వరి నీటిపాలు కావడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

త్వరగా తూకం వేయాలి : కలెక్టర్

హవేళిఘణపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని త్వరగా తూకం వేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని శాలిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తసీల్దార్ సింధురేణుక ఉన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం : ఎమ్మెల్యే

తుపాను కారణంగా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడొద్దని ఎమ్మెల్యే రోహిత్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కోతలు లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. ఆయనవెంట నాయకులు పరశురాంగౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్, కిరణ్‌గౌడ్, పోశెట్టి, రాము తదితరులున్నారు.



'కపాస్'తో కష్టమే..!

యాప్‌లో స్లాట్ బుక్‌చేస్తేనే పత్తి కొనుగోళ్లు

స్మార్ట్ ఫోన్‌లు లేక రైతుల ఇబ్బందులు

యాప్‌లో లింక్ చేసేందుకు అధికారుల వద్దకు రైతుల పరుగులు

మునిపల్లి/రాయికోడ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతును దళారుల నుంచి రక్షించడానికి, నేరుగా సీసీఐ కేంద్రాల్లో విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఈ ఏడాది కొత్తగా 'కపాస్ కిసాన్' యాప్‌ను తీసుకువచ్చింది. కానీ, ఈ యాప్‌తో లాభమా.. నష్టమా.. అనే ఆందోళన మాత్రం రైతుల్లో నెలకొన్నది.

గతంలో ప్రైవేటు వ్యాపారులు రైతులకు పెట్టుబడి కోసం డబ్బు అప్పుగా ఇచ్చేవారు. పంట చేతికి వచ్చిన తరువాత ఇంటివద్దకే వచ్చి పత్తిని కొనుగోలు చేసేవారు. బకాయి డబ్బులను తీసుకొని మిగతా డబ్బులు మాత్రమే రైతులకు ఇచ్చేవారు. కానీ, దళారు నిర్ణయించిందే ధర. తూకంలోనూ మోసాలు జరిగేవి. మద్దతు ధర కూడా దక్కేది కాదు. దళారుల చేతుల్లో రైతులు నష్టపోవద్దనే ఉద్దేశంతో ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం కపాస్ యాప్‌కు శ్రీకారం చుట్టింది. దీంతో రైతులు తమ పత్తి పంటను సీసీఐ కేంద్రాలకు తీసుకెళ్లాలంటే ముందుగా కపాస్ యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ చేసుకుని భూమి, బ్యాంకు, పంటకు సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేయాలి. పత్తిని సీసీఐ కేంద్రాలకు తీసుకెళ్లే ముందు బరువు, తేమశాతం, జిన్నింగ్ మిల్లు పేరు తదితర వివరాలను నమోదు చేయాలి. ఇందుకోసం స్మార్ట్‌ఫోన్, ఆధార్‌తో ఫోన్ నంబర్ అనుసంధానం తప్పనిసరి. రైతుల వద్ద స్మార్ట్‌ఫోన్ లేకపోవడం, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికే పంట దిగుబడి రాక రైతులు దిగులు చెందుతున్నారు. ఇప్పుడు తీసిన కొద్దిపాటి పంటనూ మద్దతుధరకు సీసీఐ కేంద్రాల్లో విక్రయిద్దామంటే 'కపాస్ యాప్' కొర్రీలతో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పెట్టుబడి కోసం అప్పిచ్చిన వ్యాపారులు, విత్తనాలు మిగతా 8వ పేజీలో

ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ

ఫలితాలు విడుదల

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. గత నెలలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే టెన్త్ ఫలితాల్లో సంగారెడ్డి జిల్లాలో 258 మంది హాజరు కాగా 155 మంది ఉత్తీర్ణులయ్యరు. మెదక్ జిల్లాలో 122 మందికి 88 మంది, సిద్దిపేట జిల్లాలో 168 మందికి 69 మంది ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా ఇంటర్మీడియట్ ఫలితాల్లో సంగారెడ్డి జిల్లాలో 603 మందికి 271 మంది ఉత్తీర్ణులయ్యారు. మెదక్ జిల్లాలో 314 మందికి 204 మంది, సిద్దిపేట జిల్లాలో 265 మందికి 135 మంది ఉత్తీర్ణత సాధించారని డీఈవో తెలిపారు. సందేహాలకు 8008403635 నంబర్‌లో కోఆర్డినేటర్ వెంకటస్వామిని సంప్రదించాలని కోరారు.

జప్తు చేసిన రేషన్ బియ్యం..

నవంబరు 11న వేలం

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పరిధిలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రేషన్ బియ్యాన్ని నవంబరు 11వ తేదీన బహిరంగ వేలం వేస్తున్నట్లు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందజేసిన బియ్యాన్ని కొందరు అక్రమార్కులు సేకరించి ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లో విక్రయించేందుకు తరలిస్తూ వివిధ ప్రాంతాల్లో పట్టుబడ్డారని పేర్కొన్నారు. వారి నుంచి జప్తు చేసిన బియ్యాన్ని గోదాముల్లో నిల్వ చేశామన్నారు. జప్తు చేసిన బియ్యం 3,872.05 క్వింటాళ్లు ఉంటుందని, నవంబరు 11వ తేదీన సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నామని తెలియజేశారు. ఈ వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగినవారు ప్రభుత్వ ఎక్సైజ్ శాఖ గుర్తింపు పొందిన బెవరేజెస్, డిస్టిలరీ సంస్థల ప్రతినిధులు (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖల ద్వారా ఆమోదం పొందిన వారు మాత్రమే) తమ సీల్డు కొటేషన్లు, సంబంధిత పత్రాలను సమర్పించాలని ఆమె సూచించారు. కొటేషన్లను నవంబరు 11వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా అందజేయాలన్నారు. అదే రోజు బహిరంగ వేలం నిర్వహిస్తామని వెల్లడించారు. పూర్తి వివరాలకు జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని జిల్లా అదనపు కలెక్టర్ మాధురి తెలిపారు.



నిర్మాణ దశలోనే నిలిచిపోయిన సమీకృత మార్కెట్ కాంప్లెక్స్ పనులు

సమీకృత మార్కెట్‌కు గ్రహణం

- నిర్మాణ దశలోనే నిలిచిపోయిన పనులు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపం
- మూడున్నరేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

సంగారెడ్డిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో సమీకృత మార్కెట్ కాంప్లెక్స్ పనులు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. మూడున్నరేళ్ల క్రితం చకచక పనులకు శ్రీకారంచుట్టిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బెస్మెంట్, పిల్లర్ల స్థాయిలోనే నిలిపివేసి చేతులెత్తేశారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులో రెండెకరాల స్థలంలో రూ.6.70 కోట్లతో 104 దుకాణాల సముదాయంగా సమీకృత మార్కెట్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని నిర్ణయించారు. 2021 డిసెంబరు 18న అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత పనులను ముమ్మరంగా చేపట్టిన సదరు కాంట్రాక్టర్ బిల్లులు రావడంలేదని ఆ తరువాత పనులను నిలిపేశాడు. ఈ పనులు పర్యవేక్షించాల్సిన పబ్లిక్‌హెల్త్ విభాగం అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఒకేచోట అన్ని విక్రయాలు జరిగేలా..

పట్టణంలో వారానికి నాలుగుచోట్ల సంతలు జరుగుతున్నాయి. ఆది, సోమ, గురు, శుక్రవారాల్లో అంగళ్లు జరుగుతున్నాయి. రోడ్లపైనే పండ్లు, పువ్వులు, మాంసం, చికెన్, చేపలు, కూరగాయలు తదితర వస్తువులు విక్రయిస్తున్నారు. అన్నిరకాల వస్తువులు విక్రయించేలా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని అప్పట్లో పనులకు శ్రీకారం చుట్టారు.

శిథిలావస్థకు అసంపూర్తి నిర్మాణాలు

మూడున్నరేళ్లుగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. జిల్లా జడ్జితో పాటు డీఆర్‌డీవో, ఆర్డీవో తదితర జిల్లా అధికారుల నివాసాలకు సమీపంలోనే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ ఉంది. ప్రస్తుతం పనులు నిలిచిపోయి పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విషసర్పాలకు నిలయంగా మారింది. గత ప్రభుత్వ హయంలో శ్రీకారం చుట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోగా, ప్రస్తుత ప్రభుత్వం కూడా రెండేళ్లుగా మార్కెట్ పనులను పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ఝరాసంగం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామని విదుత్‌శాఖ ఏడీఏ రజినీకాంత్ పేర్కొన్నారు. గురువారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఝరాసంగంలో విద్యుత్ సిబ్బందితో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. శాఖాపరంగా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న విద్యుత్ అధికారులు

చదివింది డీఈడీ.. చేసేది దొంగతనాలు

- కానిస్టేబుల్ ఉద్యోగం కోసం రెండుసార్లు ప్రయత్నం
- రాకపోవడంతో టవర్ టెక్నీషియన్‌గా..
- ఆదాయం కోసం చోరీల బాట
- నిందితుడి అరెస్ట్.. రూ. 3.34 లక్షల సొత్తు స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డీఈడీ పూర్తి చేసిన ఓ యువకుడు దొంగగా మారాడు. రెండు సార్లు పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష వరకు వెళ్లాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనం చేసి కటకటాల పాలయ్యాడు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ నిందితుడి వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా హావేళీఘణపూర్ మండల పరిధిలోని బూర్గుపల్లి తాండకు చెందిన రామావత్ రమేష్‌కుమార్ డీఈడీ పూర్తి చేసి, పోలీస్ కానిస్టేబుల్ కావాలని ప్రయత్నించాడు. రెండు సార్లు రాత పరీక్ష వరకు వెళ్లాడు. అయితే, ఉద్యోగం రాలేదు. ఈ క్రమంలో ఎయిర్‌టెల్ టవర్స్‌లో టెక్నీషియన్‌గా పని చేసి మానేశాడు. ఈజీమనీకి అలవాటు పడి మెదక్ పట్టణంతోపాటు చుట్టూ పక్కల గల టవర్స్ నుంచి ఆర్డీఎక్స్‌ను చోరీ చేశాడు. ఎయిర్‌టెల్ విజిలెన్స్ బృందం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి.. సీసీ కెమెరాల ఆధారంగా గురువారం నిందితుడిని ఇంటి వద్ద పట్టుకొని అరెస్టు చేసి, విచారించగా.. మరో నాలుగు చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి రూ.3.34 లక్షల సొత్తును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ వెల్లడించారు.

బైక్ దొంగ అరెస్టు..

మెదక్ పట్టణంలోని రాయల్ లాడ్జీ ఎదుట బుధవారం పార్కు చేసిన బైక్‌ను రామాయంపేట మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన రాములు దొంగలించాడు. గురువారం బైక్ నడుపుకుంటూ పారిపోతుండగా బ్లూకోర్ట్ సిబ్బంది వెంబడించి పట్టుకొని విచారించగా.. రామాయంపేట స్టేషన్ పరిధిలోని రెండు సార్లు బైక్ దొంగతనం చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. తాగుడుకు బానిసై దొంగతనాలకు అలవాటు పడినట్లు ఏఎస్పీ వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్, ఎస్ఐ మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.





మల్కాపూర్ నర్సరీ , పల్లె ప్రకృతి వనం పరిశీలిస్తున్న ఎంపీడీవో శాలికా

పల్లె ప్రకృతి వనం పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తూప్రాన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం మల్కాపూర్, కోనాయపల్లి (పీబీ) గ్రామాల్లో తూప్రాన్ ఎంపీడీవో శాలికా తేలు గురువారం పర్యటించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో మొక్కలు నాటారు.. నిర్వహణ మరిచారు' అంటు పల్లె ప్రకృతి వనం, నర్సరీ నిర్వహణపై కథనం ప్రచురితమైంది. ఆంధ్రజ్యోతి కథనంతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై సిబ్బందిని ప్రశ్నించారు. మండలంలోని పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, డంప్ యార్డులు వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించి పరిశీలన చేస్తానంటూ పేర్కొన్న ఎంపీడీవో శాలికా గురువారం తూప్రాన్ మండలం మల్కాపూర్, కోనాయపల్లి (పీబీ) గ్రామాల్లో పర్యటించారు.

డీజిల్ దొంగతనం కేసులో యువకుల అరెస్టు



పెద్దశంకరంపేట పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి

పెద్దశంకరంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి తెలిపారు. గురువారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లి బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బొలేరో వాహనంలో వెళ్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు వివరించారు. వనపర్తి జిల్లాకు చెందిన రాహుల్, కామారెడ్డి, జిల్లాకు చెందిన కురుమ గణేష్, లింగంపేటకు చెందిన తోకల నాగరాజులను విచారించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో వారిని పేట పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు.

వీరు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారని, డబ్బులు సరిపోక పోవడంతో ముగ్గురు కలిసి బోరబండకు చెందిన అన్వర్ అనే వ్యక్తితో కలిసి డీజిల్ దొంగతనం చేయడం ప్రారంభించారు. రోడ్డు పక్కన పార్కింగ్ చేసి లారీలలో డీజిల్ దొంగలించి అన్వర్ అనే వ్యక్తికి బోరబండలో అమ్మి, ఆ డబ్బులతో జల్సాలు చేస్తున్నారని వివరించారు. జోగిపేటలో డీజిల్ లారీల నుంచి ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాలో పలు లారీల నుంచి డీజిల్ దొంగలించి అన్వర్‌కు విక్రయించేవారు. పెద్దశంకరంపేట చర్చ్ కాంపౌండ్‌లోని నారాగౌడ్ టిప్పర్ల నుంచి ఆరు డబ్బాలలో 150 లీటర్ల డీజిల్ దొంగలించినట్లు వివరించారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు డీజిల్ దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాలుగో నిందితుడు అన్వర్ పరారీలో ఉన్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పేట ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు లేక ఆత్మహత్య



కందుకూరి నాగరాజు(ఫైల్)

పటాన్‌చెరు/సిద్దిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఒకరు, బ్యాంకులో రుణం చెల్లించలేక మరొకరు ఆత్మహత్య చేసుకున్నారు. మద్యం తాగడానికి డబ్బులు లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం వర్గల్ మండలం మినాజీపేటలో చోటు చేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మినాజీపేట గ్రామానికి చెందిన కందుకూరి నాగరాజు (26)కొంత కాలం నుంచి మద్యానికి బానిసై ఎటువంటి పని చేయడం లేదు. ఇంటి వద్దే ఉంటూ మద్యం కోసం తరచూ డబ్బులు ఇవ్వమని తల్లి కిష్టమ్మతో గొడవపడేవాడు. గురువారం ఉదయం రూ. 5000 ఇవ్వమని తల్లి కిష్టమ్మను అడగడంతో తన వద్ద డబ్బులు లేకపోవడంతో డబ్బులు ఇవ్వలేకపోయింది. దాంతో తల్లిపై నాగరాజు గొడవపడి కొట్టాడు. మధ్యాహ్నం నాగరాజు ఇంట్లో పై స్లాబ్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

రుణవాయిదా చెల్లించలేక..

బ్యాంకు నుంచి తీసుకున్న రుణం వాయిదా రెండు నెలలుగా చెల్లించలేక ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ కథనం ప్రకారం.. ఇస్నాపూర్ పురపాలక పరిధి చిట్కుల్ గ్రామానికి చెందిన సాయికృష్ణ (26) బార్బర్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. షాపు పెట్టుకునేందుకు గత ఏడాది సంగారెడ్డిలోని ఐసీఐసీ బ్యాంకులో తన తల్లి లలిత పేరిటతో రూ.13లక్షలు రుణం తీసుకున్నాడు. ఇందుకు సంబంధించిన నెలవారీ వాయిదాలు చెల్లిస్తున్నాడు. రెండు నెలుగా ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో వాయిదాలు చెల్లించడం లేదు. బ్యాంకు అధికారులు వాయిదాలు చెల్లించాలంటూ ఫోన్‌లు చేసి ఒత్తిడి చేశారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై గురువారం మధ్యాహ్నం ఉరి వేసుకున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సిద్దిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి చిన్నకోడూరు మండలం చెర్ల అంకిరెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారి పై జరిగింది. ఎస్సై సైఫ్ అలీ, తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లికి చెందిన కాషబోయిన పోచయ్య (55) వ్యవసాయంతో పాటు గొర్రెల కాపరిగా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. గురువారం రాత్రి పోచయ్య వారి బంధువైనా మహిళతో కలిసి స్కూటీపై శనిగరానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చెర్లఅంకిరెడ్డిపల్లి శివారులోని గోదాంలో నుంచి ఓ లారీ రాజీవ్ రహదారి పైకి ఎక్కి చౌరస్తా నుంచి మలుపు తిరుగుతుండగా స్కూటీ లారీ పక్క భాగంలో ఢీ కొట్టింది. దీంతో పోచయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్కూటీ పై వెనకాల కూర్చున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

చెరువులో పడి యువకుడి మృతి

కొండపాక, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన కొండపాక మండలం మర్పడగలో గురువారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్పడగ గ్రామానికి చెందిన అందిపురం రమేష్ (32)తల్లి సంవత్సరికం ఉన్నందున దుస్తులు ఉతకడం కోసం చెరువుకు అన్న రమేష్ , వదిన కరుణతోపాటు వెళ్లాడు. చెరువు మెట్ల పైన దుస్తులు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయాడు. అది గమనించిన ఆయన సోదరుడు ప్రయత్నం చేసినా అప్పటికే చెరువులో మునిగిపోయాడు. కొద్దిసేపటి తర్వాత అతడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో పౌల్ట్రీ రైతు ..

- సర్వీస్ వైరు సరిచేస్తుండగా ఘటన



రాగుల మోహన్(ఫైల్)

రామయంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సర్వీస్ వైర్ సరి చేస్తూ షాక్ తగిలి పౌల్ట్రీ రైతు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన గురువారం రామాయంపేట మండల పరిధి లక్ష్మాపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాగుల మహేష్(38) ఊరి శివారున ఉన్న తన పౌల్ట్రీ ఫార్మ్ వద్దకు ఈ ఉదయం వెళ్లాడు. అక్కడ కరెంట్ ఆన్ చేయగా సరఫరా కాలేదు. దీంతో సర్వీస్ మీటర్ లోని వైరు తొలగించి సరిచేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. ఈ ఘటనను చూసిన అక్కడే ఉన్న పలువురు రామయంపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. మృతుడికి భార్య అనిత తీవీ ఏళ్ల లోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై బాలరాజ్ ఘటనా స్థలాని వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుండె పోటుతో సెక్యూరిటీగార్డు మృతి



ఈశ్వరయ్య(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్న మంగలి ఈశ్వరయ్య(49) గుండెపోటుతో మృతి చెందాడు. సెకండ్ షిఫ్ట్ విధుల్లో ఉన్న ఆయన గురువారం సాయంత్రం ఒక్కసారిగా ఆపరేషన్ థియేటర్ వద్ద కుప్పకూలినట్టు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. హుటాహుటిన అత్యవసర విభాగానికి తరలించగా, అప్పటికే ఈశ్వరయ్య మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈశ్వరయ్య సుమారు 20 ఏళ్లుగా ఇదే ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈశ్వరయ్య కంది మండలం జుల్‌కల్ గ్రామానికి చెందిన వారని తోటి సిబ్బంది తెలిపారు.

లేబర్ పాలసీ రద్దు చేసేదాకా పోరాటం ఆగదు

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు


మాట్లాడుతున్న చుక్కా రాములు

గజ్వేల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : లేబర్ పాలసీని రద్దు చేసే దాకా పోరాటం ఆగదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన రాణే మద్రాస్ లిమిటెడ్ వర్కర్స్ యూనియన్, ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం శ్రమశక్తి నీతి-2025 పేరుతో నూతన లేబర్ పాలసీని తీసుకువచ్చిందని, దీనిని సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. కార్మికుల హక్కులకు రక్షణగా ఉండే చట్టాలను బలహీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. వేతనాల వ్యవస్థను నిర్వీర్యం చేసి పర్మినెంట్ ఉద్యోగులు లేని వ్యవస్థను తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. పరిశ్రమలలో అవకతవకలపై, కార్మికుల భద్రతపై అధికారుల తనిఖీలు లేకుండా యాజమాన్యం ఇష్టారాజ్యంగా నడుపుకునేటట్లు చట్టాలు రూపొందిస్తుందన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, కార్మిక వర్గాల హక్కుల కోసం సీఐటీయూ ఇప్పటికే పోరాటాలు చేస్తుందన్నారు. డిసెంబరులో మెదక్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల్లో కనీస వేతనాల పెంపుదల కోసం పోరాటాలు చేయడానికి ఉద్యమ కార్యాచరణను నిర్ణయించనున్నట్లు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నాసగోని వేణుగోపాల్, నాయకులు బండ్ల స్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, రంగారెడ్డి, సాజిద్, రాజగోపాల్ తదితరులున్నారు.

వివాహ వేడుకలో త్రిపుర గవర్నర్


వధూవరులతో గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

గజ్వేల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని జరిగిన ఓ వివాహానికి హాజరయ్యారు. పట్టణానికి చెందిన శివాని వివాహ రోహిత్‌తో జరుగగా ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



వందేళ్ల రైల్వేస్టేషన్‌లో సమస్యల హాల్ట్

నిజాం కాలం నాటి బ్రాహ్మణపల్లి స్టేషన్‌పై నిర్లక్ష్యం

కొత్వాల్ రాజా బహదూర్ వారసులు దానం చేసిన భూమిలో నిర్మాణం

ప్రస్తుతం కూలిపోయే దశలో భవనం

ప్రయాణికులకు అందుబాటులో లేని కనీస వసతులు


పైకప్పు పెంకులు ఊడిపోయిన స్టేషన్

తూప్రాన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇదో వందేళ్ల చరిత్ర కలిగిన రైల్వేస్టేషన్. నిజాంకాలంలో సరకుల రవాణా చేసేందుకు రైల్వేలైన్ ఏర్పాటు చేశారు. హైకోర్టు న్యాయమూర్తి స్థలం దానం చేసి చొరవ చూపడంతో స్టేషన్‌ను సైతం నిర్మించారు. అంతటి చరిత్ర కలిగిన రైల్వేస్టేషన్ ప్రస్తుతం నిరాదరణకు గురవుతోంది. అభివృద్ధికి నోచుకోక కూలిపోయే స్థితికి చేరకున్నది. ఇదే మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్.

1925లో బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్ ఏర్పాటు

తూప్రాన్ పట్టణ పరిధి బ్రాహ్మణపల్లిలో నిజాం కాలంలో 1925లో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేశారు. ఈ రైల్వేస్టేషన్ ఏర్పాటులో కొత్వాల్ రాజా బహదూర్ వెంకటరామారెడ్డి వారసుల కృషి ప్రధానమైంది. వెంకటరామారెడ్డి కుమారుడు హైకోర్టు న్యాయమూర్తి వెంకట లక్ష్మారెడ్డి 1.10 ఎకరాల భూమిని రైల్వేశాఖకు ఇవ్వడంతోనే ఈ బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్ నిర్మాణం సాధ్యమైంది. తొలుగ గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగేవి. సికింద్రాబాద్ నుంచి నాందేడ్ (మహారాష్ట్ర)కు సరకుల రవాణ కొనసాగేది. ప్రధానంగా ఉప్పు రవాణా ఎక్కువగా జరిగేది. బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో ఉప్పు దిగుమతి కాగానే సంగారెడ్డి, జహీరాబాద్, గజ్వేల్, సిద్దిపేట ప్రాంతాలకు రవాణా చేసేవారు. కాలక్రమేణ ఈ రైల్వేలైన్ ప్రజల రవాణా సౌకర్యంగా ఉపయోగంలోకి వచ్చింది. రైళ్ల నిలపడంలో వెంకట లక్ష్మారెడ్డి, ఆయన కుమారుడు కెప్టెన్ బారిష్టర్ మాజీ సర్పంచు కిష్టారెడ్డి కృషి చేశారు. బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో లాంతర్లతో విధులు నిర్వహించారు. 1975 డిసెంబర్ 5న స్టేషన్‌కు విద్యుత్ సౌకర్యం కల్పించారు. అప్పటి ఎలక్ట్రికల్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసన్ ఎలక్ట్రిక్ పనులను ప్రారంభించారు.

నిలిచిన అభివృద్ధి.. తగ్గిన రైళ్లు

కాలక్రమేణా ఈ చారిత్రక రైల్వే స్టేషన్ అధికారుల నిరాదరణకు గురైంది. స్టేషన్ భవనం సరైన నిర్వహణ లేక పెంకులు ఊడిపోయి, గోడలు శిథిలమై ఏ క్షణమైనా కూలిపోయే స్థితికి చేరుకుంది. ఈ రైల్వేస్టేషన్ సంగారెడ్డి - గజ్వేల్ మార్గంలోని పలు గ్రామాలకు అనుకూలంగా ఉండటంతో చాలా మంది వినియోగించుకున్నారు. రైల్వేస్టేషన్లు అభివృద్ధి చెందుతూ రైళ్ల నిలుపుదల పెరుగుతున్న ఈ కాలంలో, బ్రాహ్మణపల్లిలో మాత్రం రైళ్ల సంఖ్య తగ్గిపోవడం విచారకరం. గతంలో ఇక్కడ ఆగిన పర్భణి ఎక్స్‌ప్రెస్ వంటి కీలక రైళ్ల నిలుపుదలను సైతం రద్దు చేశారు. ప్రస్తుతం రోజుకు కేవలం ఆరు ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఇక్కడ ఆగుతున్నాయి.

తక్షణమే అభివృద్ధి చేయాలి

తూప్రాన్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో, 161ఏఏ జాతీయ రహదారికి పక్కనే ఉన్న బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌ను వెంటనే బాగు చేయాలని స్థానికులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. స్టేషన్ భవనానికి మరమ్మతులు చేసి, ప్లాట్‌ఫాం ఎత్తు పెంచాలని కోరుతున్నారు. మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఆగేలా, ప్రజలకు మెరుగైన రైల్వే సౌకర్యం కల్పించాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చారిత్రక స్టేషన్‌ను పునరుద్ధరించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత రైల్వే శాఖపై ఉందని వారు పేర్కొంటున్నారు.

ప్రమాదకర ప్లాట్‌ఫాం.. కరువైన వసతులు

ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువై, తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బ్రాడ్‌గేజ్ మార్గం నిర్మాణ సమయంలో ప్లాట్‌ఫాం పొడవు పెంచినప్పటికీ, ఎత్తు మాత్రం పెంచలేదు. దీంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు రైలు ఎక్కడానికి, దిగడానికి నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా, ప్రయాణికులు కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు దెబ్బతిని, వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో బెంచీల వద్ద పాములు, విష పురుగులు సంచరించే అవకాశం ఉండటంతో ప్రయాణికులు కూర్చోవడానికి భయపడుతున్నారు. రైళ్ల రాకపోకల గురించి సమాచారం అందించేందుకు కూడా స్టేషన్‌లో సిబ్బంది లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.



దేదీప్యమానం

నాచగిరి, కొమురవెల్లి క్షేత్రాల్లో కార్తీక దీపారాధన


నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వెలిగించిన దీపాలు

వర్గల్/కొమురవెల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ క్షేత్రాలైన కొమురవెల్లి మల్లన్న, వర్గల్ మండలంలోని నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి ఆలయాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధనను నిర్వహించారు. నాచగిరిలో నిత్య దీపోత్సవంలో భాగంగా ఆలయ మండపంలో భక్తులు వివిధ ఆకృతులతో ఏర్పాటు చేసిన ప్రమిదలలో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్తా, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు పర్యవేక్షణలో నిత్య దీపారాధన కార్యక్రమం కొనసాగుతున్నది. కార్తీక శుద్ధ నవమిని పురస్కరించుకుని కొమురవెల్లి మల్లన్న ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహామండపంలో 9వ రోజు శ్రీరుద్ర పారాయణ స్తోత్రం నిర్వహించారు. అంతతనంర మహిళలకు ప్రమిదలు, నూనె అందించి దీపాలను వెలిగించారు. దీపాల కాంతిలో మహామండపం శోభాయమానంగా వెలుగొందింది.


కొమురవెల్లి మల్లన్న ఆలయంలోని మహామండపంలో దీపాల కాంతిలో చేస్తున్న పూజలు

అన్నదాతకు అన్నీ కష్టాలే!

మొదట అనావృష్టి, మధ్యలో అతివృష్టి... చివరికి 'మొంథా' పిడుగు!

చేతికొచ్చిన పంటపై తుఫాన్ ప్రభావం

మద్దతు ధర కంటే తక్కువకే అమ్ముకోవాల్సిన దుస్థితి

కొనుగోళ్లకు అడ్డంకిగా తేమ శాతం


గజ్వేల్ మండలం సింగాటంలో నేలకొరిగిన వరి పంట

గజ్వేల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి ఈ వానాకాలం సీజన్ ఏమాత్రం కలసి రాలేదు. ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్ సమస్యలు ఒకదాని వెంట ఒకటి వెంటాడుతుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. మొదట్లో దాదాపు నెల రోజుల పాటు వర్షాలు లేక అనావృష్టి భయం వెంటాడింది. ఆ తర్వాత ఏకబిగిన రెండు నెలల పాటు కురిసిన భారీ వర్షాలకు (అతివృష్టి) చేలలో కలుపు తీయలేని పరిస్థితి ఏర్పడింది. తీరా పంట చేతికి వచ్చిన ఈ సమయంలో మొంథా తుఫాన్ ప్రభావంతో మరోసారి పంటలపై పిడుగు పడినట్లయింది.

తుఫాన్ దెబ్బ.. పత్తి, వరి, మక్కలకు నష్టం

తాజా వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేలలో ఉన్న పత్తి నల్లబారిపోగా, కల్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్నలు మొలకెత్తాయి. జిల్లాలో అత్యధికంగా 3.40 లక్షల ఎకరాల్లో సాగైన వరి పంట కోత దశకు చేరుకున్నది. చేతికి వచ్చే సమయంలో కురిసిన వర్షాల కారణంగా కొన్ని చోట్ల పంట నేలకు ఒరిగింది. ఈ తుఫాన్ ప్రభావం జిల్లాలోని హుస్నాబాద్, అక్కన్నపేట, నంగునూరు, చిన్నకోడూరు, కొమురవెల్లి మండలాలపై భారీగా పడింది. ఈ ఏడాది జిల్లాలో సాధారణ వర్షపాతం 698.5 మిల్లీమీటర్లు కాగా, ఏకంగా 1105.7 మిల్లీమీటర్లు నమోదైంది.

మద్దతు ధర కన్నా తక్కువకే విక్రయం

పంట నష్టంతో పాటు మార్కెట్‌లో ధరలు పడిపోవడం రైతులను మరింత కుంగదీస్తోంది. పత్తికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.8,110 కాగా, బహిరంగ మార్కెట్‌లో కేవలం రూ.7 వేలు దాటడం లేదు. దీంతో రైతు క్వింటాలుపై దాదాపు రూ.1200 వరకు నష్టపోతున్నాడు. మక్కలకు మద్దతు ధర రూ.2,400 ఉండగా, మార్కెట్‌లో రూ.1,900 మాత్రమే పలుకుతోంది. ఫలితంగా క్వింటాలుకు రూ.500 నుంచి రూ.600 వరకు నష్టం వాటిల్లుతోంది. గతంలో కురిసిన వర్షాలకు పంట ఉత్పత్తుల నాణ్యత తగ్గి, రంగు మారడంతో పాటు, చేలలోనే మొలకెత్తడంతో ప్రైవేటు వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తేమ సమస్య

రైతులకు నష్టం జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను, కేంద్రం సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ, తేమ శాతం కొనుగోళ్లకు ప్రధాన అడ్డంకిగా మారింది. తేమ శాతం 20 శాతం ఉన్నా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరినా ఇప్పటి వరకు స్పందన లేదు. దీంతో పంటలను అమ్ముకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

జగదేవ్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో అక్కడక్కడ భారీ వర్షాలు, పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాలని జగదేవ్‌పూర్ మండల వ్యవసాయ అధికారి వసంతరావు జాగ్రత్తలను వివరించారు.

- పొలంలో నుంచి మురుగు నీటిని తీసివేయడానికి కాలువలు చేసుకోవాలి.
- వానలు పడుతున్న సమయంలో మందులను పిచికారీ చేయడం, ఎరువులు వేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలి.
- రైతులు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, చెరువులు, నీటి కుంటలకు దూరంగా ఉండాలి. చెట్ల కింద నిలబడరాదు. పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచరాదు.
- తాత్కాలికంగా పంట కోతలను వాయిదా వేసుకోవాలి. మార్కెట్‌కు తరలించిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌తో కప్పి ఉంచుకోవాలి.
- అలుగు పారుతున్న చెరువులలో మట్టి కోతను నివారించడానికి ఇసుక నింపిన సంచులను తాత్కాలిక అడ్డుకట్టలుగా వేసుకోవాలి.
- వేరుశనగ, కుసుమ, శనగ, ఆవాలు మరియు మొక్కజొన్న పంటలను నవంబరు 15వ తేదీ వరకు విత్తుకోవచ్చు.

ఇంకెప్పుడు కొంటారు


తొగుట మండలం ఘనపూర్‌లో వర్షానికి తడిసిన మొక్కజొన్నలు

తొగుట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లాలో 418 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టగా, 412 కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే ప్రారంభించింది. అందులో 92 కేంద్రాల్లో మాత్రమే కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి. 7,021 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి మిల్లులకు తరలించారు. మిగతా చోట్ల తేమ శాతం రావడం లేదని సాకుతో ఇంకా తూకం వేయడం ప్రారంభించలేదు. దీంతో కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దయింది. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 3.40 లక్షల ఎకరాల్లో వరి పంట సాగుచేయగా, 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటికే చాలా మంది రైతులు పంటను కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చారు. మిగతా పంట ఇంకా పొలాల్లోనే ఉండటంతో రైతులు మదనపడుతున్నారు. చాలా చోట్ల తుఫాన్ ప్రభావంతో పంట నేలవాలగా, రైతులు లబోదిబమంటున్నారు. జిల్లాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 9 చోట్ల మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కానీ చాలాచోట్ల తూకం వేయకపోవడంతో అకాల వర్షానికి తడిసి మొలకెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి ఘటనలో కేసు ఎందుకు నమోదు చేయలేదు?

● పోలీసు వ్యవస్థకు కనిపించడం లేదా?

● నవంబర్ 1న హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ

● ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ


మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మీద దాడి జరిగితే ఇంకా కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రశ్నించారు. సంగారెడ్డిలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో కేసులను సుమోటోగా స్వీకరిస్తున్న పోలీసు వ్యవస్థకు చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మానవ హక్కుల కమిషన్ ఎందుకు మౌనం వహిస్తుందన్నారు. కోర్టులో దాడి జరిగినా కంటెంట్ ఆఫ్ కోర్టు, కోర్టు దిక్కరణ కింద శిక్షలు ఎందుకు పడవని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితులకు రక్షణ ఎలా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. జస్టిస్ గవాయ్ స్థానంలో ఉన్నత కులాలకు చెందిన జడ్జి ఉంటే కేసు నమోదు చేయడంలో ఇలా నిర్లక్ష్యం చేసి ఉండే వారా అని ప్రశ్నించారు. హర్యానాలో ఒక లాయర్‌కు జడ్జికి వాగ్వాదం జరిగితే జడ్జిని అమర్యాదగా మాట్లాడినందుకే అతనిపై సుమోటో కేసు పెట్టి చర్యలు తీసుకుంటున్నప్పుడు, ఇక్కడ సీజే మీద బూటుతో దాడి చేసినా కూడా కేసులు, అరెస్టులు లేకపోవడం దారుణమన్నారు. గవాయిపై జరిగిన దాడి ఘటనను నిరసిస్తూ జాతీయ స్థాయిలో దళితుల ఆత్మగౌరవ పోరాటం చేపడుతున్నామని అన్నారు. ఈ ఘటన మీద సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జి చేత విచారణ జరిపించి, దీని వెనుక ఉన్న శక్తులను గుర్తించాలని కోరారు. ఈ విషయంలో న్యాయాన్ని కోరుతూ నవంబర్ 1న లక్షలాది మందితో చలో హైదరాబాద్ పేరుతో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తామని మందకృష్ణ మాదిగ తెలిపారు. ర్యాలీకిరాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి ప్రజలు తరలిరావాలని కోరారు. సమావేశంలోఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి రామారావు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ, నాయకులు రాజు, పెద్దగీత మాదిగ, అబ్రాహం మాదిగ, దేవరంపల్లి అశోక్, ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు కృష్ణాపూర్ స్కూల్ విద్యార్థిని ఎంపిక

కల్హేర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కృష్ణాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని కె.హర్షిత అండర్-19 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సుధాకర్, పీఈటీ రాములుయాదవ్ గరువారం తెలిపారు. నారాయణఖేడ్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి హర్షిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. హర్షిత, పీఈటీని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

జియాలజిస్ట్‌గా యూపీఎస్సీ ర్యాంకర్

జగదేవ్‌పూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలం పట్టిపల్లి గ్రామానికి చెందిన తప్పెట్ల సంధ్య హైడ్రో జియాలజిస్టుగా ఎంపికైంది. బుధవారం సాయంత్రం విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో 29వ ర్యాంకు సాధించింది. హైడ్రో జియాలజిస్టుగా ఉద్యోగానికి ఎంపికైంది. తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

సింగూరు మూడు గేట్లు ఎత్తివేత

● ఇన్ ఫ్లో 21,935... అవుట్‌ఫ్లో 26,313 క్యూసెక్కులు

పుల్‌కల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తూఫాన్ ఎఫెక్ట్‌తో కురిసిన వర్షాలకు సింగూరు ప్రాజెక్టులోకి భారీగా వరద చేరుతోంది. బుధవారం వరద నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు 14వ క్రస్ట్‌గేట్‌ను ఎత్తగా, గురువారం ఉదయం నాటికి వరద మరింతగా పెరిగింది. దీంతో 12, 15వ క్రస్ట్‌గేట్లను మీటరున్నర ఎత్తారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 21,935 క్యూసెక్కులు నమోదయింది. ప్రస్తుతం 14వ క్రస్ట్‌గేట్‌ను రెండు మీటర్లు, 12, 15వ క్రస్ట్‌గేట్లను మీటరున్నర ఎత్తారు. మూడు క్రస్ట్‌గేట్ల ద్వారా 23,918 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ గుండా 2,395 క్యూసెక్కులు వరదను దిగువన ఉన్న మంజీర జలాశయానికి వదులుతున్నారు. మొత్తం అవుట్‌ఫ్లో 26,313 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 520.675 మీటర్లకు 17.133 టీఎంసీలు నీరు నిల్వ ఉంది.


ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల అవుతున్న వరద

న్యూస్ బాక్స్

డీసీసీబీ మేనేజర్‌గా దీపక్‌కుమార్

పాపన్నపేట/కల్హేర్/సిర్గాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాపన్నపేట డీసీసీబీ మేనేజర్‌గా బి.దీపక్ కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సిర్గాపూర్ నుంచి ఇక్కడికి రాగా, ఇక్కడ పనిచేసిన కిషన్‌రావు నారాయణఖేడ్‌కు బదిలీపై వెళ్లారు. అలాగే మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) మేనేజర్‌గా ఎల్లం నియమితులయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు. మేనేజర్ ఎల్లంను స్థానిక బీఆర్ఎస్ నాయకులు కిరణ్‌రావ్, నర్సాగౌడ్, నారాయణనాయక్, బ్యాంకు సిబ్బంది సన్మానించారు. ఇక్కడ పనిచేసిన మేనేజర్ దీపక్ మెదక్ జిల్లా పాపన్నపేటకు బదిలీ కాగా, సిద్దిపేట జిల్లా కొండపాకలో విధులు నిర్వహిస్తున్న ఎల్లం సిర్గాపూర్‌కు వచ్చారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దశంకరంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని కేజీబీవీలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్‌వో గీత గురువారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై, 18-45 ఏళ్లలోపు మహిళలు అర్హులన్నారు. ఈనెల 31 నుంచి నవంబరు 6వ తేదీవరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నవంబరు 5, 6 తేదీల్లో ఆలయ వార్షికోత్సవం

నారాయణఖేడ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని భూమయ్య కాలనీలో గల అభయాంజనేయ పంచాయతన ఆలయ 5వ వార్షికోత్సవాన్ని నవంబరు 5, 6వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న పుణ్యాహవచనం, దేవతాస్థాపనలు, స్వామివారికి విశేష అభిషేకం, హోమం, శివపార్వతుల కల్యాణం, దీపోత్సవం, తీర్థ, మహాప్రసాదాల వితరణ, 6న స్వామివారికి విశేష అభిషేకం, సహస్ర నాగవల్లి దళార్చన, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదాల వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

ఎంపీడీవోగా స్పందనదుర్గా బాధ్యతల స్వీకరణ

నాగల్‌గిద్ద, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నాగల్‌గిద్ద ఎంపీడీవోగా స్పందన దుర్గా గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా మహేశ్వర్‌రావు విధులు నిర్వహిస్తుండగా.. ఇటీవల గ్రూప్-1లో సెలక్ట్ అయిన స్పందనదుర్గాను నాగల్‌గిద్ద ఎంపీడీవోగా ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన ఆమెను పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది శాలువా, పూలమాలలతో సత్కరించారు.

తుమ్నూరులో పౌరహక్కుల దినోత్సవం

మనూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తుమ్నూరులో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్ పాల్గొని మాట్లాడారు. ప్రజలకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మనూరు ఎస్ఐ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాముల శబరిమల పాదయాత్ర

తూప్రాన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ శివారులోని అయ్యప్ప ఆలయం నుంచి అయ్యప్ప మాలధారణ స్వాములు శబరిమలకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. శ్రీ శబరి గిరీష మహా పాదయాత్ర సమితి ఆధ్వర్యంలో గురువారం స్వాములు పాదయాత్రగా వెళ్లారు.

ప్రయాణికులకు ఆర్టీసీ యాప్ కీ చైన్లు అందజేత

నారాయణఖేడ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : టీజీఎస్ ఆర్టీసీ యాప్‌కు సంబంధించి రూపొందించిన కీచైన్లను గురువారం ఖేడ్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం ప్రయాణికులకు పంపిణీ చేశారు. పలు మార్గాల్లో వెళ్తున్న బస్సుల్లో ఉన్న ప్రయాణికులకు ఆయన కీ చైన్లను అందజేసి, యాప్ ద్వారా అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




సిరిపురంలో శిథిలావస్థకు చేరిన బీసీ వసతి గృహం, బీసీ వసతి గృహంలో పెచ్చులూడిన దృశ్యం

సమస్యలతో సహవాసం

- శిథిలావస్థలో వసతిగృహ భవనం
- భయం గుప్పెట్లో విద్యార్థులు

హత్నూర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని సిరిపురం బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పరిసర గ్రామాల విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సుమారు 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం బీసీ బాలుర వసతి గృహాన్ని నిర్మించింది. అప్పట్లో వందల సంఖ్య విద్యార్థులు అక్కడ ఉండి విద్యనభ్యసించేవారు. మూడేళ్లుగా భవనం శిథిలావస్థకు చేరి పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విద్యార్థులు నివాసం ఉంటున్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టి కేవలం 30 మందికి చేరింది. ప్రస్తుతం వర్షం పడుతుండడంతో భవనం మరింత ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనానికి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

డీఈవో ఆదేశాలు బేఖాతర్

- దెగుల్‌వాడిలో ఇష్టానుసారంగా సమ్మెటివ్ పరీక్షల నిర్వహణ
- హెచ్‌ఎం తీరుతో విస్తుపోయిన అధికారులు

కంగ్టి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు బేఖాతర్ చేస్తూ ప్రధానోపాధ్యాయుడు తన ఇష్టానుసారంగా సమ్మెటివ్-1 పరీక్షలు నిర్వహిస్తున్న వైనం గురువారం సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని దెగుల్‌వాడి ప్రాథమికోన్నత పాఠశాలలో వెలుగు చూసింది. డీఈవో ఆదేశాల మేరకు ఈనెల 24 నుంచి 31 తేదీవరకు 1 నుంచి 9వ తరగతి వరకు సమ్మెటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. షెడ్యుల్ ప్రకారం ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు 1 నుంచి 6 తరగతులకు, మధ్యాహ్నం 1.30 నుంచి 4 గంటల వరకు 7 నుంచి 9వ తరగతులకు పరీక్షలు నిర్వహించాలి. కానీ దెగుల్‌వాడి హెచ్‌ఎం రేఖారాణి మాత్రం ప్రతిరోజు ఉదయం 11 గంటలకు వచ్చి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గురువారం ఎంఈవో రహీమొద్దీన్, కాంప్లెక్స్ హెచ్‌ఎం శైలజ కులకర్ణి చేపట్టిన తనిఖీలో వెల్లడైంది. అంతేకాక 7వ తరగతి విద్యార్థులకు ఈనెల 29న గణితం పరీక్ష నిర్వహించాల్సి ఉండగా... హెచ్‌ఎం మాత్రం 29న సామాన్యశాస్త్రం, 30న గణితం పరీక్ష నిర్వహించాలని ఉపాధ్యాయులకు ప్రశ్నాపత్రాలు అప్పగించింది. ఒకరోజు నిర్వహించాల్సిన పరీక్షను మరొక రోజు నిర్వహిస్తుండడం చూసి అధికారులు విస్తుపోయారు. ఈ విషయంలో సదరు ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈవో షెడ్యూల్ ప్రకారం కాకుండా మీ ఇష్టానుసారంగా పరీక్షలు నిర్వహిస్తారా అని ప్రశ్నించారు. హెచ్‌ఎం ఎలా చెబితే మీరు అలాగే చేస్తారా అంటూ నిలదీశారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించలేకపోతున్నప్పుడు పిల్లలకు పాఠాలు ఎలా బోధిస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటే ఉపేక్షించేది లేదని, పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా 29న ముందుగానే తన సబ్జెక్టు సామాన్యశాస్త్రం పరీక్ష నిర్వహించిన హెచ్‌ఎం శైలజ కులకర్ణి 30న సెలవుపై వెళ్లడం గమనార్హం.



దెగుల్‌వాడి పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎం

'జూబ్లీహిల్స్' ప్రచారంలో అందోల్ నేతలు

పుల్‌కల్/నారాయణఖేడ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రచారంలో అందోల్ నేతలు ప్రచారానికి తరలివెళ్లారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ప్రథమ శ్రేణి నాయకులు కాంగ్రెస్, బీఆర్ఎస్ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులకు మద్దతుగా వెళ్లి పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఎర్రగడ్డ డివిజన్‌లోనే రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ కాంగ్రెస్ అభ్యర్థి తరఫున, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున ప్రచారం చేసి, ఓట్లేసి గెలిపించాలని కోరారు. అలాగే నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి షేక్‌పేట డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి తరఫున, ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఎర్రగడ్డలో బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున ప్రచారం చేశారు.



ఎర్రగడ్డ డివిజన్‌లో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ

ఎన్నికలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు : ఎమ్మెల్యే

చేగుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వానికి రైతుల సమస్యలపై లేదని దుబ్బాక ఎమ్మెలే కొత్త ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. గురువారం నార్సింగి మండలంలో పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజులుగా తుఫాన్ కారణంగా ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతుంటే జిల్లా ఇన్‌చార్జి మంత్రులు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మకాం వేశారని మండిపడ్డారు. ప్రభుత్వం హంగు ఆర్భాటంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు అక్కడ సరైన సౌకర్యాలు కల్పించలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు లేక రైతులు తెచ్చిన ధాన్యం తడిసి మొలకెత్తుతున్న కలెక్టర్లు, జిల్లా మంత్రులు పట్టించుకున్న పాపానపోలేదన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టిన ఏ ప్రభుత్వాలు మనుగడ సాగించలేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతుల పక్షాన కాంగ్రెస్ నాయకుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు షైలారం బాబు, నాయకులు మల్లేశంగౌడ్, రాజిరెడ్డి, భాషనాయక్, భుపతి రాజ్ పాల్గొన్నారు.



నార్సింగిలో కొనుగోలు కేంద్రాలను సందర్శించి, తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

భూములు ఇప్పించండి

నారాయణఖేడ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మా భూములు మాకే ఇప్పించాలని మండల పరిధిలోని హంగర్గ.కే గ్రామస్థులు గురువారం నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 2006లో తమ భూములను ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యాపారులు తమ భూముల్లో పరిశ్రమలను ఏర్పాటు చేయించి, ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి, తక్కువ ధరకు బలవంతంగా కొనుగోలు చేశారన్నారు. ప్రస్తుతం ఆ భూముల్లో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా ఇతరులకు విక్రయిస్తున్నారన్నారు. అందువల్ల మా భూములను మాకే ఇప్పించాలని వారు సబ్ కలెక్టర్ ఉమాహారతిని కోరారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న హంగర్గ.కె గ్రామస్థులు

తాగునీటి సమస్య పరిష్కరించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సమస్యను త్వరగా పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని జక్కన్నపేట గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ తాగునీటి పంపింగ్ హౌజ్‌ను పరిశీలించి మాట్లాడారు. సమస్యను తెలుసుకుని వెంటనే మోటార్‌ను బాగు చేయించి 35 గ్రామాలకు తాగునీటిని పునరుద్ధరించాలన్నారు. తాత్కాలిక మోటార్లను తెప్పించి శుక్రవారం మధ్యాహ్నం వరకు నీళ్ల సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈఈ నాగభూషణం, నికిత, బాలక్రిష్ణ, తదితరులున్నారు.

వరి పంటల్లో మెళకువలు తప్పనిసరి

- మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్

తూప్రాన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి పంటల్లో మెళకువలు తప్పనిసరిగా పాటించాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ సూచించారు. గురువారం తూప్రాన్ మండలం జెండాపల్లి గ్రామంలో మండల విస్తరణ అధికారులు యాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలను పరిశీలించారు. యాసంగిలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గంగమల్లు, రైతుల పాల్గొన్నారు.

వికాస్ వొకేషనల్ జూనియక్ కాలేజీకి అనుమతి లేదు



వికాస్ వొకేషనల్ జూనియర్ కాలేజీకి నోటీసును అంటిస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరావ్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శాంతినగర్‌లోని వికాస్ వొకేషనల్ జూనియర్ కాలేజీకి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేవని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్ తెలిపారు. గురువారం ఆయన కళాశాలకు నోటీసును అంటించి మాట్లాడారు. వికాస్ వొకేషనల్ జూనియర్ కాలేజీ కొనసాగింపుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేనికారణంగా విద్యార్థులెవరూ చేరవద్దని సూచించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలని తెలిపారు. విద్యార్థులు ఎవరైనా చేరితే బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్, జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయం బాధ్యత వహించదని ఆయన స్పష్టం చేశారు.

నేటి నుంచి అనంతశయన బ్రహ్మోత్సవాలు

నారాయణఖేడ్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట అనంతశయన మందిరంలో ఈనెల 31 నుంచి నవంబరు 5 వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 31న హనుమాన్ వాహనసేవ, నవంబరు 1న శేషవాహన సేవ, 2న గజవాహన సేవ, 3న గరుడవాహన సేవ, 4న అశ్వవాహన సేవ, పల్లకీసేవ, 5న పౌర్ణమిని పురస్కరించుకొని పల్లకీసేవ, కార్తీక దీపోత్సవం, రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

మోదుగు కొమ్మకు ఐదు ఆకులు



రేగోడులో మోదుగు కొమ్మకు ఐదు ఆకులు చూపిస్తున్న రైతు

రేగోడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మోదుగు చెట్టు కొమ్మకు సాధారణంగా మూడు ఆకులు ఉండడం చూస్తాం. కానీ రేగోడు మండలంలోని సంగమేశ్వర్‌తండాకు చెందిన రైతు దేవిసింగ్ పొలంలో మోదుగు చెట్టు కొమ్మకు ఐదు ఆకులు వచ్చాయి. దీంతో గిరిజనులు ఆశ్చర్యంగా తిలకించి, పూజలు చేశారు. మోదుగు ఆకుకు ఐదు ఆకులను చూడడం ఇదే మొదటిసారి అని తండావాసులు పేర్కొన్నారు.

రైతులు సుస్థిర పద్ధతులను పాటించాలి

జహీరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు వ్యవసాయరంగంలో సుస్థిర పద్ధతులను పాటించాలని డీడీఎస్-కేవీకే సీనియర్ శాస్త్రవేత్త వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని దిడిగి శివారులో గల డీడీఎస్-కేవీకేలో తేనెటీగల పెంపకంపై మూడురోజులుగా రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ అటారీ ఆధ్వర్యంలో శిక్షణను ఇస్తున్నామని వివరించారు. తేనెటీగల పెంపకం, ప్రయోజనాలు, దిగుబడులు తదితరాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు, అధికారులు సూచించిన తరహాలో రైతులు సాగు పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. సాధ్యమైనంత వరకు రైతులు వ్యవసాయ రంగంలో సుస్థిర పద్ధతులు పాటిస్తూ లాభసాటి వ్యవసాయంపై దృష్టిపెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శైలజ, ప్రియాంక, రమేష్, హేమలత రైతులు పాల్గొన్నారు.



రైతులకు తేనెటీగల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త వరప్రసాద్

మండల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపీడీవో

చేగుంట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల అభివృద్ధికి ప్రతీ అధికారి అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీవో ప్రీతిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నార్సింగి మండల పరిషత్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు లేకుండా పనులు కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాజేశ్వర్, నార్సింగి ఈవో నాగభూషణం, పంచయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారీ లే 'అవుట్'!

(5వ పేజీ తరువాయి)

ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ భూములన్నీ అసైన్డ్ భూములే కావడంతో రైతులు తప్పనిసరిగా ఒప్పుకున్నారు. సాగు యోగ్యమైన భూములను ఇచ్చినా ప్లాట్ల అప్పగింతపై అధికారులు తమకు ఏ సమాచారం ఇవ్వడం లేదని రైతు కిషన్ వాపోయారు. భూములు ఇవ్వకపోతే మాస్టర్ ప్లాన్, రోడ్ల విస్తరణలో భూములు కోల్పోవాల్సి వస్తుందనే భయంతో ఒప్పందం చేసుకున్నామని, ఇప్పుడు ఒక్క ప్లాటూ దక్కలేదని మరికొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ల్యాండ్‌పూలింగ్ ప్రాజెక్టులో ఇప్పటికే కొన్ని అభివృద్ధి పనులు పూర్తి కావడంతో ప్రభుత్వం బహిరంగ వేలం ద్వారా ప్లాట్లు విక్రయించవచ్చునని స్థానికులు అంటున్నారు.

'కపాస్'తో కష్టమే..!

(5వ పేజీ తరువాయి)

పురుగుమందులు ఉద్దెర ఇచ్చిన దుకాణదారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. రాయికోడ్ మార్కెట్ డివిజన్ పరిధిలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇప్పటికీ తెరుచుకోకపోవడంతో ఎక్కడ విక్రయించాలో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు.

12 శాతం లోపు తేమ తప్పనిసరి

వారంలో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయి. సీసీఐ కేంద్రాల్లో పత్తి క్వింటాలుకు రూ.8,110 మద్దతు ధర చెల్లిస్తాం. జిల్లాలో 26 కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నాం. కేంద్రానికి తీసుకువచ్చే ముందు కపాస్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. తేమ 12 శాతం లోపు ఉండేలా చూసుకోవాలి.

-వరుణ్ రఘువీర్, సీసీఐ కమర్షియల్ ఆఫీసర్

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

పుల్‌కల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో ఆరుకాలం కష్టించిన వరి పంట నీటి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రమైన చౌటకూర్‌తో పాటు బొమ్మారెడ్డిగూడెం గ్రామాలలో కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. చేతికందిన పంట అకాల వర్షానికి ధాన్యం తడిసి మొలకలు వస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ కోలా సుదర్శన్, సంతోష్, దేవన్న, సుభాష్‌నాయక్, రాజు, ఆకేష్, సుభాష్ తదితరులున్నారు.

ఉజ్వల కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకోండి

కోహీర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అర్హులైన లబ్ధిదారులు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోహీర్‌లోని ఇండియన్ మనీషా గ్యాస్ ఏజెన్సీ వారు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు కోహీర్‌లోని మనీషా ఇండియన్ గ్యాస్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గతంలో గ్యాస్ కనెక్షన్ ఉన్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోరాదని తెలిపారు. కొత్తగా రేషన్‌కార్డు వచ్చి ఇప్పటివరకు గ్యాస్ కనెక్షన్ పొందుకోలేనివారు మాత్రమే ఉజ్వల పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అలాగే దరఖాస్తులకు తుది గడువు లేదన్నారు. ఈ కనెక్షన్ పొందినవారికి గ్యాస్ సిలిండర్, మొదటి రీఫిల్, గ్యాస్‌స్టౌ, సురక్ష పైపు, రెగ్యులేటర్, ఇన్‌స్టాలేషన్ పూర్తిగా ఉచితంగా అందుతాయన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

నారాయణఖేడ్/జహీరాబాద్/చిన్నశంకరంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కిందిదొడ్డి సతీష్ అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉన్నత విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు స్వరాజ్, నాయకులు భరత్, శ్రీనివాస్, రజనీకాంత్, అశోక్ పాల్గొన్నారు. జహీరాబాద్‌లో డీవైఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు హరీశ్, శ్రీకాంత్, అభి, చిన్న, కోటిరెడ్డి ఆధ్వర్యంలో కళాశాలల బంద్ నిర్వహించారు. చిన్నశంకరంపేటలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించిన కళాశాలల బంద్ విజయవంతమైంది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ శ్రీలతస్వామిరాజ్

చిన్నశంకరంపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలం చందంపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గురువారం ఉదయం మృతిచెందాడు. బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సహకారంతో మాజీ సర్పంచ్ శ్రీలతస్వామిరాజ్ అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలను బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

వెల్దుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం వెల్దుర్తి సొసైటీ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ సమావేశంలో సొసైటీ సీఈవో అశోక్, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు దీక్షిత



దీక్షిత

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడే ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు సంగారెడ్డిలోని తారా కళాశాలకు చెందిన విద్యార్థిని దీక్షిత ఎంపికైంది. గుజరాత్‌లోని పటాన్‌లో ఈ నెల 31వ తేదీ నుంచి నవంబరు 9వ తేదీవరకు జరిగే క్యాంపునకు ఓయూ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని, అందులో తమ కళాశాల విద్యార్థిని దీక్షిత ఎంపికకావడం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు.

వ్యక్తిపై దాడి కేసులో నిందితుడికి జైలు

జోగిపేట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడిచేసిన కేసులో నిందితుడికి మూడునెలల 20 రోజుల జైలు శిక్ష విధిస్తూ జోగిపేట మున్సిఫ్ మేజిస్ట్రేట్ అసదుల్లా షరీఫ్ తీర్పునిచ్చారు. జూలై 4న జోగిపేటకు చెందిన ఎర్రమ్మోల్ల నెహ్రూ జోగిపేటలోని క్లాక్ టవర్ వద్ద గల ఒక కిరాణా షాప్ వద్దకు మద్యం మత్తులో వెళ్లి దుకాణ యజమాని రంగా శ్రీకాంత్‌పై కర్రతో దాడిచేసి గాయపరిచాడు. ఈ విషయమై బాధితుడు అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కోర్టులో హాజరుపర్చగా జోగిపేట మున్సిఫ్ మేజిస్ట్రేట్ అసదుల్లా షరీఫ్ వాదోపవాదనలు విన్న తర్వాత నిందితుడు ఎర్రమ్మోల్ల నెహ్రూ కు మూడునెలల 20 రోజులు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.